క్లుప్తంగా

రంజాన్ తోఫా పంపిణీ



పేద ముస్లింలకు తోఫా పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ముస్లింల సేవా గుణం చాలా గొప్పదని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 66వ వార్డుకు చెందిన షేక్ మదీనావలి ఆధ్వర్యంలో పేద ముస్లింలకు ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రంజాన్ మాసంలో పేదలకు తమ వంతు సాయం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎండీ గౌస్, పెదిరెడ్ల ఈశ్వరరావు, రామకృష్ణారెడ్డి, షఫీ, షాహిద్, మాదార్ వలీ, సురేష్, వాయిజ్, సింహాచలం పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న దేవరకొండ మార్కండేయులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా నియమితులైన దేవరకొండ మార్కండేయులు ఆదివారం మిందిలో మాజీ మంత్రి, విశాఖ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కండేయులు తనకు బాధ్యతను అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అమర్‌నాథ్‌ను కలిసిన వారిలో బోని శివరామకృష్ణ, 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

ఆర్వోబీ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఐలా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ ఎఫ్ – బ్లాక్ వద్ద జరుగుతున్న ఆర్వోబీ పనులను ఆదివారం ఐలా ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయినట్టు తెలిపారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు అడ్డంకిగా ఉన్నాయని.. వాటిని తొలగించే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. భూగర్భ విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేసి అవాంతరాలను అధిగమిస్తున్నట్టు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పూర్ణ

అగనంపూడి: మహాత్మాగాంధీ సేవా సమితి 11వ వార్షికోత్సవం, ఉగాది పురస్కరించుకొని అగనంపూడి సత్రం కూడలిలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ, జనసేన నాయకుడు గవర సోమశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ సేవా సంఘం పేరుతో దశాబ్ద కాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘ అధ్యక్షుడు చిత్తా రామారావును అభినందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పట్టా రామఅప్పారావు, కరణం సత్యారావు, పైడిరాజు, గళ్లరాజు, కోసూరి తాతారావు, కరణం బలయోగి, జగదీష్, బొబ్బరి నాగు పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్ట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీపంలో రహస్యంగా కోడిపందాలు ఆడుతున్న ఏడుగురిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి.. ఆదివారం ఉదయం బీసీ గేటు సమీపంలో కోడి పందాలు జరుగుతున్నట్టు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్ఐ తాతారావు నేతృత్వంలో పోలీసులు అక్కడకు వెళ్లి ఏడుగురు వ్యక్తులతో పాటు రెండు కోళ్లు, రూ. 12320 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మికం.. సేవా భావం

పెదగంట్యాడ: ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్. దీనిని దాన ధర్మాల మాసంగానూ పిలుస్తారు. ఇస్లాం మతబోధనల ప్రకారం జీవితాన్ని సన్మార్గంలో పెట్టేందుకు శిక్షణ పొందే మాసంగా ప్రాముఖ్యత సంతరించుకుంది. రంజాన్ మాసం తర్వాత 11 నెలలు మనిషి సన్మార్గంలో జీవించే విధానాన్ని అలవరుస్తుంది. ఆరాధనల విషయంలో ఇస్లాం నిర్వచనం విభిన్నమైనది. విధిగా చేయాల్సిన నమాజ్, రోజా, జకాత్, ఫిత్రా వంటి సత్కార్యాలే కాకుండా అల్లాహ్ ప్రసన్నత కోసం ఖురాన్ పఠనం చేస్తారు. ఖురాన్‌లో చెప్పినట్టు చేసే ప్రతి మంచి పని దైవారాధనకే వస్తుందని భావిస్తారు. రంజాన్ మాసంలో చేసే వితరణలకు ఎక్కువకు పుణ్య ఫలం దక్కుతుందని మత పెద్దలు చెబుతున్నారు. అలాగే ఈ మాసంలో కఠిన ఉపవాసం చేస్తారు. సూర్యోదయానికి ముందు ఆహారం (సహర్) భుజించి దీక్ష చేపడతారు. సూర్యాస్తమయం వరకు కఠోర ఉపవాసం ఉంటారు. ఆ తరువాత ఇఫ్తార్‌లో కొద్దిపాటి ఆహారాన్ని స్వీకరించి దీక్ష విరమిస్తారు. ఇలా రంజాన్ మాసం అంతా కఠిన ఉపవాసం పాటిస్తారు. నేడు రంజాన్ సందర్భంగా ప్రత్యేక కథనం.



విద్యుత్ కాంతుల్లో ఇస్లాంపేట జామియా మసీదు



ఇఫ్తార్ విందులో..

- రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు
- నమాజ్‌కు ప్రాధాన్యం
- ఇఫ్తార్‌తో ప్రత్యేక అనుబంధం

సమానత్వానికి ప్రతీక

రంజాన్ మాసం పేదలు, ధనికుల మధ్య తారతమ్యాలను చెరిపేస్తుంది. పేదలు కూడా ధనికులతో సమానంగా పండగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే జకాత్, ఫిత్రా దానం చేయాలని ఇస్లాంలో పేర్కొన్నారు.

దానధర్మాలు కీలకమైనవి

ఈ మాసంలో పేదలకు ఎక్కువగా దానాలు చేస్తారు. రంజాన్ మాసంలో చేసిన దానధర్మాలకు రెట్టింపు పుణ్యం ఉంటుందని పవిత్ర గ్రంథం ఖురాన్‌లో పేర్కొన్నట్టు మతపెద్దలు చెబుతారు. ఈ కారణంగానే రంజాన్ మాసంలో జకాత్ , ఫిత్రా వంటివి పేదలకు అందజేస్తారు. వీటిని ఈద్ నమాజ్‌కు ముందుగానే చెల్లించాలనేది నియమం. ఇంట్లో ఉన్న వారందరి పేరిట ఫిత్రా తప్పనిసరిగా ఇవ్వాలి.

ఇఫ్తార్‌తో అందరూ ఒక్కటనే భావన

కులాలు, పార్టీలకు అతీతంగా రంజాన్ మాసంలో అందరూ ఇఫ్తార్ విందు ఇస్తుంటారు. ఒకే మనస్సు, ఒకే భావన కలిగి కులాలకు అతీతంగా జరిగే ఈ ఇఫ్తార్ విందు అందరి పట్ల సోదరభావం కలిగిస్తుంది. ఇఫ్తార్‌లో అందరు ఒకే చోట చేరి కలిసి భోజనాలు చేయడం అదృష్టంగా భావిస్తుంటారు.

మానసిక ప్రశాంతతకు నమాజ్, దువా



ప్రతి ముస్లిం రోజులో అయిదుసార్లు నమాజ్ చేయాలనే నిబంధన ఉంది. నమాజ్‌లో తక్బీర్, రకాత్, ఆల్ ఖయాం, రుకూ, జల్సా, సజ్దా, ఖయాం, సలాం అనే క్రియలు ఉంటాయి. ప్రతి క్రియ వ్యాయామం సాగించేలా ఉంటుంది. సూర్యోదయం కన్నా ముందు ఫజర్ నమాజ్‌తో ప్రార్థనలు మొదలవుతాయి. మధ్యాహ్నం–జుహర్, సాయంత్రం– అసర్, సూర్యాస్తమంలో–మగ్‌రిబ్, రాత్రి–ఇషా నమాజ్ విధిగా చేస్తారు. ప్రతి నమాజ్ అనంతరం సూరాలను చదువుతూ చేసే దువా చేస్తారు. అందరినీ ఆపదల నుంచి కాపాడాలని, విశ్వ శాంతి కోసం కోరుతూ ప్రార్థన చేస్తారు. నమాజ్, దువా ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

– సుభాన్, ఇస్లాంపేట

ఆధ్యాత్మికత కోసమే ఉపవాసం



పవిత్ర రంజాన్ మాసంలో కఠిన ఉపవాసం ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తుంది. సూర్యోదయం నుంచి సూర్యాస్తసమయం వరకూ మంచినీళ్లు కూడా తాగకుండా ఉపవాసం ఉండడం వల్ల అల్లాపై భక్తి భావన, విశ్వాసం కలుగుతుంది. ఇలా ఉపవాసం చేయడం ఆరోగ్యానికీ మంచిది.

–ఎంకే మొహిద్దీన్ బాబా, దేవాడ

వాడవాడలా ఉగాది వేడుకలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పెదగంట్యాడ: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఉగాది పచ్చడి, పిండి వంటల తయారు చేసి దేవుళ్లకు నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు.. కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని కోరుకుంటూ భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతిధామానికి భక్తులు పోటెత్తారు. స్వహస్తాలతో స్వామివారికి మల్లెపూలతో అభిషేకం చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యంబాబు, కార్యదర్శి రవిశేఖర్ ఏర్పాట్లు చేశారు.
- పత్రీజీ అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వాహకులు మీసాల శివగణేశ్వరరావు ఆధ్వర్యంలో ధ్యాన ప్రచారంలో ఉత్తమ సేవలందించిన ధనలక్ష్మి, దేవికలకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వనిత, లక్ష్మి, నీలకంఠం, విష్ణుకుమార్, శ్యామల పాల్గొన్నారు.
- బాలా చెరువులోని ఉమాలింగేశ్వర స్వామి ఆలయంలో ఉమారామలింగేశ్వరునికి అర్చకుడు వాసుదేవశర్మ అభిషేకం చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం నిర్వహించారు.



పెదనడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో..



ఉగాది వేడుకలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం చంద్రశేఖర్

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో..

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశుని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం తిరుమలేశుడిని చందనంతో అలంకరించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఉగాది పంచాంగ శ్రవణం వినిపించారు.

స్టీల్‌క్లబ్‌లో..

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని స్టీల్‌క్లబ్‌లో ఉగాది వేడుకలను స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ వై. చంద్రశేఖర్ ప్రారంభించారు. కాండ్రేగుల రామారావు పంచాంగ శ్రవణం చేశారు. ప్రముఖ శాక్సోఫోన్ సింగర్ సాయి సురేష్ బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వైఆర్‌కే బృందం చేసిన గాన కచేరీ అలరించింది. లక్కీడిప్ విజేతలకు హైదరాబాద్‌కు చెందిన ల్యాండ్రైజ్ రియాల్టీ వారు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి డి. వేణుగోపాల్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందుకున్న కళాక్షేత్రం ఉద్యోగులు



పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మహిళలను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉక్కు ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో..

ఉక్కునగరం: స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆచాళ్ల రామకృష్ణ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఉద్యోగులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. కళాక్షేత్రంలో పని చేసే సిబ్బందికి రూ. 10 లక్షలు ఇన్సూరెన్స్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.ఎం.ఎస్. విభాగం మెకానికల్ జీఎం శోభన్‌బాబు, ఎం.ఎం విభాగం జీఎం ఎల్. పురుషోత్తం, కళాక్షేత్రం కార్యదర్శి టి. సత్యనారాయణ, గుర్తింపు సంఘంతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, బి. అప్పారావు, డి. అప్పారావు, రామ్మోహన్‌కుమార్, కాండ్రేగుల శ్రీనివాస నాయుడు, పి.వి. నగేష్, వై.టి.దాస్ పాల్గొన్నారు.



బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ..



బాలాజీ దివ్యక్షేత్రంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితులు

సనాతన ధర్మానికి ప్రతీక ఉగాది

అగనంపూడి: సనాతన ధర్మానికి ప్రతీకగా ఉగాది నిలుస్తుందని బ్రహ్మకుమారీస్ విశాఖ ఇన్‌చార్జ్ బీకే త్రివేణి అన్నారు. అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) సారథ్యంలో విశ్వావసు నామ సంవత్సర సంవత్సరాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల, జాతి గొప్పతనానికి ఉగాది ఆభరణంగా నిలుస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యంలో శిక్షణ పొందిన బాలల నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, నృత్య శిక్షకుడు శివ, కోట్ని నరసింహమూర్తి, బుజ్జి, శ్రీరామ భక్త పరివారం పాల్గొన్నారు.

శ్రీవారికి ఆభరణాల బహూకరణ



వెండి సాలగ్రామాలను అందజేస్తున్న దాతలు శ్రీనివాస్, అర్జిత దంపతులు



రూ. లక్ష విరాళం అందజేస్తున్న పవన్ కుమార్, సత్యవాణి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి భక్తులు వివిధ రూపాల్లో తమ కానుకలు అందజేస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం షీలానగర్‌కు చెందిన శ్రీనివాస్, అర్జిత దంపతులు తిరుమలేశునికి రూ.2,50,000 విలువ గల 108 సాలగ్రామలతో తయారు చేయించిన వెండి మాలను తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

- శ్రీవారి అన్నదాన మూల నిధికి షీలానగర్ దరి గోదావరి లేఅవుట్‌కు చెందిన కోడే పవన్ కుమార్, సత్యవాణి దంపతులు రూ.లక్ష అందించారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బొర్రమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రధాన తేదీలు వెల్లడించిన ఉత్సవ కమిటీ

అగనంపూడి: అగనంపూడి పరిసర అష్ట గ్రామాల ఆరాధ్య దైవం, కోరికలు తీర్చే కల్లవల్లి బొర్రమాంబ జాతర వచ్చేనెల 15వ తేదీన నిర్వహించేందుకు నిర్ణయించామని బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ చెప్పారు. పాత అగనంపూడి రామాలయ ఆవరణలో ఆదివారం అమ్మవారి జాతర పోస్టర్‌ను ఉత్సవ కమిటీలు సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గ్రామాల ప్రజలు ఇష్టదైవంగా కొలిచే బొర్రమాంబ తల్లి ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీన దుర్గాలమ్మ తల్లి జాతర, 8న పరదేశమ్మ తల్లి ఉత్సవం, 10న బొర్రమాంబ పుట్ట బంగారు మహోత్సవం, 14న తొలేళ్ల జాతర, కోటి దీపారాధన, 15న అమ్మవార్ని భారీ ఊరేగింపుతో అనుపు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కోల్‌కతా లైటింగ్, సెట్టింగ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతోపాటు ఉత్తరాంధ్రలోనే ప్రఖ్యాతి గాంచిన బాణ సంచా విన్యాసాలు ఏర్పాటు చేయడమైందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలి

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ, మంగళపాలెం, తలారివానిపాలెం రెవెన్యూ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఫ్లాట్లు కేటాయించాలని కోరుతూ ఆదివారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. టిడ్కో గృహ సముదాయ ఆవరణలో చేపట్టిన ధర్నాలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ పదేళ్ల కిందట టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఏడేళ్ల కిందట దాదాపు పనులు పూర్తి చేశారన్నారు. అర్హులను ఎంపిక చేసి డిపాజిట్లు సేకరించినా నేటికీ కూడా రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వసతి, ఔట్‌లెట్, విద్యుత్ సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు లబ్ధిదారులకు కేటాయించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వెంటనే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, రొక్కం శ్రీనివాసరావు, జి.మల్లేశ్వరరావు, ఎ.గోపి, తిరుపతిరావు, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న లబ్ధిదారులు

విజయకుమార్‌కు ఉగాది పురస్కారం

ఉక్కునగరం: ప్రముఖ మెజీషియన్, ఉక్కు విశ్రాంత అధికారి కొల్లాబత్తుల విజయకుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం అందుకున్నారు. విజయకుమార్ ఇంద్రజాలంలో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. ఉగాది సందర్భంగా ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా విజయకుమార్ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి కందుల దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి నుంచి ఉగాది పురస్కారం అందుకుంటున్న విజయకుమార్

తప్పిన ముప్పు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్, భెల్ సిగ్నల్ పాయింట్ల వద్ద ఆదివారం రెండు రోడ్డు ప్రమాదాలు సంభవించాయి.రెండు ఘటనల్లో వాహనాలు నుజ్జునుజ్జు అయినా ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.షీలానగర్ డీ మార్ట్ వద్ద మల్కాపురానికి చెందిన ఒక వ్యక్తి స్కూటీ పార్కింగ్ చేశాడు. ఇదే సమయంలో పార్కింగ్ యార్డు నుంచి వచ్చిన లారీ స్కూటీని ఢీ కొట్టి ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో స్కూటీ పూర్తిగా నుజ్జయింది. ఈ ప్రమాదంపై స్కూటీ యజమాని గాజువాక ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

లారీలు ఢీ : భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద ఆదివారం రెండు కంటైనర్ లారీలు పక్కపక్కనే వస్తూ ఢీ కొట్టుకున్నాయి. ఒక లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసం అయ్యింది. లారీని క్రేన్ సహాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు.



పార్కింగ్ చేసిన స్కూటీని తొక్కేసిన లారీ

సందడిగా రాములోరి పెళ్లిరాట మహోత్సవం

అక్కిరెడ్డిపాలెం: వచ్చే నెల 6న శ్రీరామనవమి సందర్భంగా అక్కిరెడ్డిపాలెంలోని సీతారామలక్ష్మణ స్వాముల ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రామాలయం వద్ద కల్యాణ రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద రాట మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణానికి రాట ఉత్సవం నిర్వహించారు. 6న శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణం నిర్వహించనున్నట్టు ప్రధానార్చకుడు భావనారాయణ స్వామి తెలిపారు. అర్చకులు హరినారాయణ స్వామి నేతృత్వంలో సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

ఘనంగా పడిపూజ

అక్కిరెడ్డిపాలెం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో ఆదివారం సాయంత్రం పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు గురుస్వామి అదపాక వెంకటరమణ ఆధ్వర్యంలో సాయంత్రం అల్పాహారం భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ సమితి అధ్యక్షుడు ఎస్.ఏ.నాయుడు, శేషగిరిరావు, సేవా సమితి ప్రతినిధులు, ఎస్.నాయుడు, సీహెచ్.మురళీశ్వరరావు, జనార్దనరావు పాల్గొన్నారు.